చైనా తెరమీద

# ఆదర్శాల చిమ్మచీకటి

ఎస్. నటరాజన్

ఆ పక్కనే కాలవ. ఆ కాలవ ప్రవాహాన్ని దాటివొచ్చే ప్రయత్నంలో పగలల్లా కమ్యూనిస్టు సైన్యాలు విఫలులైనా, పొద్దు గూకినకొద్దీ విజయోన్ముఖులై వారనే ప్రభుత్వ సేనాధిపతులు అంచనా వేసుకున్నారు. దూరంగా డేరాల్లో కూచుని అంచానాలైతే సులభంగా వేస్తారు కాని, సైన్యాలుపడే బాధ అర్థమౌతుందా వాళ్ళకి? దూరంగా క్షితిజంనించి చీకటి చైనాభూభాగాన్ని ఆవరిస్తోంది. దానికి తోడుగా చలి కూడాను. ఆ కాలవకి ఉత్తరపుగట్టున విప్లవోన్మత్తులైన చైనా ఎర్ర సైన్యం; దక్షిణపుగట్టున ఊసూరు మనుకుంటూ ప్రతిఘటన సాగిస్తున్న చైనా ప్రభుత్వ సైన్యం.

* * *

చీకటిలోంచి అవతలిగట్టున పేలే ఫిరంగుల దారుణాగ్నివర్షం కనిపిస్తోంది. దక్షిణపుగట్టున ఏవో పిచ్చిమొక్కల పొదలచాటున పడిపోయి దొర్లుతున్నాడు ఆ సైనికుడు. చీకట్లో ఖాకీ డ్రెస్సు నల్లగా, పిశాచికి మల్లే అతన్ని ఆవరించుకుని అతనికి అప్పజెప్పబడిన కర్తవ్యాన్ని, బలవంతంగా నిరూపిస్తోంది. అయినా అతను పక్కకు పడిపోయినాడు. అతను పడిపోయిన నేల తేమగా ఉంటానికి కారణం రక్తమూ కావొచ్చు; మంచు గాని కావచ్చు. స్పృహ లేకపోవటంవల్ల తుపాకీ దూరంగా పడివుంది. లేచి నిలబడే ఓపిక కొద్దో గొప్పో వున్నా, వీపు మీద వున్న భారమైన సామాగ్రివల్ల ఆ వోపిక నశిస్తోంది.

'దాహం ..' చీకట్లోంచి, భయంకరమైన మారణాస్త్రాల మోతలనించి తప్పించుకుని, అతని గొంతులోంచి జీరగా, బాధగా ఆ ఒక్కమాట వెలువడింది. అతని ఊహలన్నీ మెల్లగా మేల్కొంటున్నై. తానున్నది యుద్ధరంగంలో గదూ?... తన దాహం సంగతి ఎవరికి పట్టింది? అయినా రెండురోజుల క్రితం ఆహారం సప్లయి ఆగిపోయిందని చెప్పారు. అయితే ఈ యుద్ధాన్ని ఆపెయ్యకూడదూ?...ఎత్తిన తల చప్పున వంచాడు. ఒక ఫిరంగిగుండు పొదల్లోగుండా దూసుకుని చెవి దగ్గరగా పోయింది. అదృష్టమే.

కాలులోంచి దూసుకుపోయిన గుండు. బాధ కూడా ప్రారంభమైంది ఆలోచనలకేనా వ్యవధివ్వకుండా. మూలుగుతున్నాడు.

'ఎవరది...?' పక్కనే ఎవరిదో కొత్త స్వరం విని ఉలిక్కిపడ్డాడు. 'ఎవరు బాబూ, మీదగ్గిర వాటర్ బాటిల్ వుందా?' దీనంగా, దాహంగా వినపడ్డది నూతనుడి స్వరం. ఎడంవైపు రెండు గజాల్లో ఉన్నాడేమో చేరుకున్నాడు.

'ఎక్కణ్ణించి మాట్లాడుతున్నావు?' తన స్వరం వినపడుతుందో లేదో అనుమానంగానే వుంది.

'ఇక్కడే...' దగ్గరగా దొర్లుకుంటూవొచ్చింది ఒక మానవశరీరం. ఆ కటికచీకట్లో ఆకారాన్ని మాత్రమే పోల్చుకోగల్గాడు గాని ఇంకేమీ కనప్డంలేదు.

'నాదగ్గరా నీళ్లుఅయిపోయినై. నేను అల్లాడుతున్నాను దానికోసమే. ఇక మరీ ప్రాణంమీదికి వొస్తే నెత్తురుతాగాల్సిందేమో...' విసుగ్గా, చిరాకుగా అన్నాడు మొదటి సైనికుడు.

రెండవ సైనికుడు నవ్వినవ్వు ఫిరంగి మోతలో వినిపించలేదు.

'నువ్వు ఏవూరు?' నవ్వాపి, కొత్తసైనికుడు కనుక్కున్నాడు తన పరిచితుణ్ణి.

నాదా? టీన్‌సీన్ పక్కనే చిన్నగ్రామంలే. దానికేంగాని, నువ్వు శుభ్రంగామాట్లాడుతున్నావు గదా, పడుకున్నావేం తుపాకీ కాల్చకండా?' మొదటి సైనికుడిలో, ఇంకా ప్రభుత్వభక్తి నశించలేదు. నీరసంగా పనిచేస్తోంది రక్తంలో.

'ఏంచెయ్యనుమరి? తిండీ తిప్పలూ లేకండా, తుపాకీ ఎట్లా లేస్తుందంటావు?'

తూర్పున చంద్రబింబం మందమైన కాంతితో ఉదయిస్తోంది. విజయానాసక్తితో ఇరుపక్షాలూ చేస్తున్న మారణహోమం కొద్దిగా కనిపిస్తోంది.

'మేమంతా చెయ్యగాలేనిది నీకే వొచ్చిందా అంతనీరసం?' మొదటి సైనికుడు కొంచెం మంద లింపుగా విమర్శించాడు. నూతనుడి మొహంమీద నవ్వు మందమైన వెన్నెట్లో కనిపించింది.

'అవునుగాని, ఎన్ని నెలలనించి జీతం ఇవ్వటం లేదు మనకు, తెలుసా? ఇంటిదగ్గిర నావాళ్లు తిండి లేక మాడిపోతోంటే, నేను ఏ ఆదర్శంకోసం యుద్ధంచెయ్యాలో నాకర్థం గావటంలేదు.'

రెండవ సైనికుడికి ఈమాటలు తుపాకీ గుండ్లల్లే తగిలాయి. నిజమే! తన ఇద్దరు పసిపిల్లలూ, భార్యా, ఏమైనారో ... ఆరునెల్ల జీతంరావాలి. ఎందుకని జీతం ఇవ్వరు? అమెరికానించి అన్ని డాలర్లు వొచ్చినైగా! ..అతని ఆలోచనలు పైకి పొక్కినై.

'అయితే ఇన్నాళ్ళనించి జీతం ఎందుకని ఇవ్వ టంలేదంటావు?' ఈ ప్రశ్నవెనక శారీరకబాధ చేత, మూలుగు, నీరసం, వొణుకూ ధ్వనించినై. బహుశా రక్తం చాలినంతలేదు అతని శరీరంలో.

'ఏమో? నాకు మాత్రం తెలుసా? అయితే మన రెజిమెంటు సోల్జర్లు చాలామంది ఒకమాట న్నారు!' ఆగిపోయినాడతను, వాళ్ళపక్కనించి రెండు టాంకులూ, ఇరవైమంది సైనికులు పరిగెత్త డంవల్ల! పైగా పైన విమానాల రొద జాస్త యింది.

'ఏమన్నారు?' ఆదుర్దాగా ఆసక్తిగా కనుక్కు న్నాడు ఆవసానదశలో ఉన్న మొదటి సైని కుడు. చిట్టచివరగా ఏకో కొత్త సంగతీ, అందులో నూతన జీవిత సమస్యకు సంబంధించినదీ విన సంగతి వినాలనే కోర్కె అతనిలో పని చేస్తోంది.

'నేను చెప్పేది అందరికీ తెలిసిన రహస్యమే. నీకు తెలీదంటే ఆశ్చర్యంగా ఉంది. జీతం మొత్తా లేమో,సైన్యాధికారులకివొస్తున్నాయి. కాని సైని కులకి రావటంలేదు.'

'అంటే.'

'అంటేనా? అంటే ఈ కర్నలూ్సి. జనరలూ్సి మింగుతున్నారు.'

'అయితే మనం యుద్ధం చెయ్యడం ఎందుకూ?'

'అదే నిన్నటిదాకా నాకూ అర్థంకాని విష యంగా ఉండేది. ఇవ్వాళ బోధపడ్డది.'

'ఏం తెలిసింది?' మొదటి సైనికుడి గొంతు సరిగా వినబట్టంలేదు. మరణావస్థపడుతూనే తను ఎవరికోసం మరణిస్తున్నాడో తెలుసుకోవాలని కుతూహల పడుతున్నాడు.

'వ్యాపారస్థుల లాభాలూ, భూస్వాముల భూ ములూ సురక్షితంగా ఉండేందుకూ, జనం ఆక లితో మాడి చచ్చేందుకున్నూ.'

'నిజమా?' మృత్యుముఖంలో అర్థమై, కానీ మాటలకి ఆశ్చర్యమూ కోపమూ కలిసిన సమా ధానంఇచ్చి మొదటిసైనికుడు కళ్లు మూశాడు.

రెండవ అతనికి ఈ సంగతి తెలీదు. అతను చెప్పుకు పోతున్నాడు: 'నిజమూ? నువ్వూ నేనూ బతుకున్నంతనిజం. అందుకనే మన సైన్యాలు ఎక్కడికక్కడికే ఓడిపోతున్నాయి ..ఓడిపోతు న్నాయా? పొరపడ్డాను. అవతలి సైన్యాలతో కలిసిపోతున్నాయి. ఇటు విను మిత్రమా! మన రెజిమెంటుకూడా ఇంకా రెండుగంటలలో అవతల వాళ్ళతో కలిసేట్టుంది ...' ఉత్సాహంతో అన్నాడు అతను.

సమాధానంగాని, వింటున్నట్టు సంజ్ఞగాని లేక పోయ్యేప్పటికి మాట్లాడుతున్నవాడు ఆగిపోయి శవంవైపు చెయ్యిచాపి చూశాడు .చల్లగా తగిలింది.

'పాపం...' అని మాత్రం అనేసి అతను తన రిస్టువాచిలో మెరుస్తున్న అంకెలవంక చూశాడు. ఎనిమిదిన్నర అవుతోంది. 'ఇంకాగంట వ్యవధి ఉంది....కార్యక్రమానికి' అంటూ, పొగలపక్క నించి ఆ సైనికుడు కాలవవైపు పాకుతూ మసక వెన్నెట్లో కలిసిపోయాడు.

## శ్రీ శ్రీ ఉవాచ

పండుకాని పండు విభూషి పండు :
రాష్ట్రంలేని రాష్ట్రపతి డాక్టర్ పట్టాభి.